క్లుప్తంగా

ఇంటింటా దీపావళి కాంతులు



కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

రాయదుర్గం: నియోజకవర్గ ప్రజలందరికీ ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్ట శక్తుల పై దైవభక్తి సాధించిన విజయాలకు ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు. ఈ పండుగ సందర్భంగా సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో విరజిల్లాలన్నారు.

ఘనంగా ఉరగాద్రి బాలోత్సవం పోటీలు



వివిధ వేషధారణల్లో చిన్నారులు

ఉరవకొండ: నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరగాద్రి బాలోత్సవ నియోజకవర్గ పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 3 -10వ తరగతి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పోటీలను నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధి వెంకట్, ఆర్టీటీ రీజనల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గానం, నృత్యం, నాటికలు, మెమరీ టెస్టుల మీద పోటీలు నిర్వహించగా 300 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 36 మంది విజేతలకు ఈనెల 14న బహుమతులు అందిస్తామన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థి రియాజ్‌బాషాను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి పి. రియాజ్‌బాషా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విద్యార్థిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, ఎంపీటీసీ చిక్కన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పకడ్బందీగా 'రీ సర్వే'



ముప్పలకుంటలో రీ సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

బ్రహ్మసముద్రం: రీ సర్వే పకడ్బందీగా చేపట్టామని డీటీ కృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని పిల్లలపల్లి గ్రామ రెవెన్యూ పొలంలోని ముప్పలకుంట, బొమ్మగానిపల్లి లో రీ సర్వే పనులు చేపట్టారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో మద్రిస్వామి, విలేజ్ సర్వేయర్లు హరీష్ , సుకేష్, శంకర్‌నాథ రాజ్, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

బెళుగుప్ప: మండలంలోని రమనేపల్లి వద్ద శనివారం జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం వెళ్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన బోల్తాపడింది. కారులో ఉన్న అనిల్, చంద్రికతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



పుండ్లు కాకుండా ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూడేరు: జాగ్రతలు పాటిస్తే చేతి, కాళ్ల వేళ్ల పుండ్లు కాకుండా అరికట్టవచ్చని హెల్త్ సూపర్ వైజర్ రవీంద్ర , ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ అన్నారు. శనివారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో అంగవైకల్య నివారణ, వైద్య పునరావాస కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహించారు. కుష్టు వ్యాధిగ్రస్తులు ముందస్తు జాగ్రతలు తీసుకుంటే అంగవైకల్యం బారినపడకుండా రక్షణ పొందవచ్చన్నారు. రోజూ టబ్‌లో నీరు పోసి అందులో చేతులు, కాళ్లు ఉంచి సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ముందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం భాను, ఆశావర్కర్లు రామాంజనమ్మ, పెద్దక్క పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి భారీ స్పందన



రాయదుర్గం టౌన్ 3వ వార్డులో సీఎం జగన్ చేస్తున్న మంచిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని 3వ వార్డులో ఇంటింటా పర్యటించి సీఎం వైస్ జగన్ ఇచ్చిన హామీలు వివరిస్తూ చంద్రబాబు మోసాలను ప్రజల్లో ఎండగట్టారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా మళ్లీ జగనే ఎందుకు కావాలనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసి ప్రజల మద్దతు కోరుతూ ముందుకు సాగారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో సీఎం వైస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రజల కళ్లెదుట స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మేనిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీలన్నీ దాదాపు 99 శాతం అమలు చేశారన్నారు. 14 ఏళ్లుగా చంద్రబాబు సీఎంగా ఉండి ప్రజలకు ఎలాంటి మంచి చేశాడో చెప్పే ధైర్యం టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ఉందా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు 610 హామీలిచ్చి మోసం చేసిన వైనం ప్రజలు మర్చిపోలేదన్నారు. పిల్లలకు అమ్మ ఒడి, అక్కచెల్లమ్మలకు చేయూత, ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, చేదోడు, తోడు, ఆరోగ్యశ్రీ, మెరుగైన విద్య, వైద్యం, పేదలకు ఇళ్లు, పింఛన్లు లాంటి సంక్షేమ పథకాలు కలకాలం ఉండాలంటే జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎంగా ఆశీర్వదించి రుణం తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్టీ సిద్దప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, పోరాళ్ల గోవిందరాజులు, ఫకృద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, సచివాలయాల కన్వీనర్ బుజ్జి, మైనారిటీ విభాగం నాయకుడు గోల్డ్ ఘని, వార్డు ఇన్‌చార్జులు పోరాళ్ల శివకుమార్, పద్మ, గోనబావి నిజాముద్దీన్, గంగాధర్, జయంతి విష్ణు, నాగరాజు(ఓబ), కొలిమి ఆనంద్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో 'జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా శనివారం జెడ్పీటీసీ మల్లికార్జున, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం పథకాల నుంచి చేకూరిన లబ్ధిని వివరించారు. మాటలతో మాయ చేసే టీడీపీ నయవంచకులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, ఉడేగోళం పీఏసీఎస్ చైర్మన్ భీమన్న, సచివాలయ కన్వీనర్ మల్లికార్జున, ఆయతపల్లి జనార్దన, వీరాపురం ఆంజనేయులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీ కాంతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ మాట్లాడుతూ ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవి , ఎర్రిస్వామి, రుద్రరెడ్డి, గోపాల్, గోవిందరెడ్డి,కెఎం రాజు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంబదూరు: మండల కేంద్రంలోని సచివాలయం -1 పరిధిలోని ఇళ్లకు ప్రజా ప్రతినిధులు,వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు వెళ్లి నాలుగున్నరేళ్లలో సీఎం జగనన్న చేసి మేలులను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, నాయకులు మల్లూరి వెంకటేశులు, మీ సేవ కుమార్, అబ్బాస్, ప్రసాద్, రాజు, చంద్ర, పవన్, రిజ్వాన్, కిరణ్, క్రాంతి, మారుతి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం మండలం ఉడేగోళంలో జగన్ పాలనలో జరిగిన మంచిని వివరిస్తున్న జెడ్పీటీసీ మల్లికార్జున, పార్టీ అధికార ప్రతినిధి మాధవరెడ్డి



గుమ్మఘట్ట మండలం 75వీరాపురం గ్రామంలో ఇంటింటా సర్వే చేస్తున్న మండల కన్వీనర్ , జెడ్పీటీసీ



కంబదూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మౌలానా ఆజాద్ సేవలు చిరస్మరణీయం



రాయదుర్గంటౌన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కౌన్సిలర్లు



కళ్యాణదుర్గంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు యువతకు ఆదర్శనీయమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కొలిమివీధిలో ఉన్న 2వ సచివాలయంలో ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. మౌలానా చిత్రపటానికి కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి విప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్ మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖమంత్రిగా ఆజాద్ దేశానికి ఎనలేని సేవలందించారని, హిందూ ముస్లింల ఐక్యతకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్టీ సిద్దప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, పోరాళ్ల గోవిందరాజులు, ఫకృద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, మైనారిటీ విభాగం నాయకుడు గోల్డ్ ఘని, వార్డు ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ భారత విద్యా వ్యవస్థ రూపురేఖలు మార్చిన దార్శినికుడని...ఆయన అందరికీ ఆదర్శ ప్రాయుడని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. స్థానిక టీ సర్కిల్‌లో శనివారం అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీల సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి వారు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, కో ఆప్షన్ సభ్యుడు అప్జల్, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి, జేసీఎస్ కన్వీనర్ అర్చన, నాయకులు సుధీర్, బిక్కిహరి, హేమ, టిప్పు, హబీబ్, సైపుల్లా, రామాంజనేయులు, రాము, రమేష్, సల్లా మారుతి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాలపై ఆకస్మిక దాడులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలపై గుంతకల్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వైజీ శంకర్ శనివారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. విక్రయాలకు సంబంధించి నిబంధనలు పాటించకపోవడం, ఎంఆర్‌పీ, తయారీ తేదీలు లేకపోవడం ఇతర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశారు. తొమ్మిది దుకాణాలపై కేసు నమోదు చేసి రూ.20,500 అపరాధ రుసుం వసూలు చేశారు. కొనుగోళ్లపై వినియోగదారులు రసీదులు తీసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఆయనతోపాటు టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్ పాల్గొన్నారు. అలాగే కణేకల్లులో ఓ ఎండీఎం వెహికల్‌లో బియ్యం పంపిణీ తనిఖీలో కార్డుదారుడికి కేజీ బియ్యం తక్కువగా రావడంతో కేసు నమోదు చేసి రూ.10 వేలు అపరాధ రుసుం విధించారు.



టపాసుల దుకాణంపై కేసు నమోదు చేస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్

పేలుతున్న టపాసుల ధరలు!



రాయదుర్గంలో వెలసిన టపాసుల దుకాణాలు

- బెంబేలెత్తుతున్న ప్రజలు
- మందకొడిగా సాగుతున్న వ్యాపారాలు

రాయదుర్గం: తారాజువ్వల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిచ్చుబుడ్లు కాస్తా చెట్టెక్కి కూర్చున్నాయి. కాకరపువ్వొత్తుల్లో చుక్కలు కనిపిస్తున్నాయి. మతాబులు చూస్తేనే మండిపోతున్నాయి. అయినా ఏడాదికోసారి వచ్చే పండుగకోసం .. ఇంట్లో పిల్లల ఆనందం కోసం.. ఎంతో కొంత వెచ్చించక తప్పట్లేదు. ఆ కారణంగానే వినియోగదారులపై ధరల మోత మోగుతోంది. అసలే అమ్మకాలు లేక సతమతమవుతున్న వ్యాపారులకు ధరలు కాస్త తలపోటునిస్తున్నాయి. గత ఏడాది కంటే 20 నుంచి 25 శాతం ధరలు పెరగాయని వ్యాపారులు వాపోతున్నారు. జీఎస్టీ, రవాణా, రసాయన ధరలు పెరగడం.. తమిళనాడు రాష్ట్రం శివకాశి నుంచి రావాల్సిన ప్రొడక్షన్ తగ్గడం లాంటి కారణాలు వెరసి టపాసుల ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు సాగక దుకాణాలు వెలవెలబోతున్నాయి. కాగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో లైసెన్స్ కలిగిన టపాసుల దుకాణాలు సుమారు 35 ఉన్నాయి. పెరిగిన ధరల నేపథ్యంలో ఈ ఏడాది వ్యాపారం దెబ్బతినే అవకాశం ఉందని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెలుగుల వేళ చీకటి దరి చేరనీయొద్దు



ప్రతి ఇంట ఎంతో సందడిగా.. ఆనందంగా జరుపుకునే ఈ దీపావళి పండుగ వేళ చీకటి దరిచేరే పొరపాట్లకు తావివ్వద్దు.. ఇళ్లల్లో టపాసుల నిల్వతో పాటు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించకుండా యజమానులకు ఆదేశాలు జారీ చేశాం. టపాసులు కాల్చేసారి పాలిస్టర్ కాకుండా కాటన్ దుస్తులు ధరించాలి. ప్రమాద సమయాల్లో ముందుగా అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

– రాణిసుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలు వీరే ..



విజేతలను ప్రకటిస్తున్న ఆర్టీసీ డీఎం సురేష్‌కుమార్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం నుంచి ఉరవకొండ రూట్‌లో నిర్వహించిన లక్కీడిప్ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం ఆర్టీసీ డిపోలో లక్కీడిప్ తీసి విజేతలను ప్రకటించారు. ప్రయాణికుల సమక్షంలో ఆర్టీసీ డీఎం సురేష్‌బాబు లక్కీడిప్ తీశారు. మొదటి బహుమతి మంజునాథ్ (కణేకల్లు), రెండో బహుమతి సిద్దప్ప(కణేకల్లు), మూడో బహుమతి సతీష్ (కణేకల్లు)కు లభించింది డిసెంబర్ వరకూ రాయదుర్గం నుంచి ఉరవకొండ రూట్‌లో లక్కీడిప్ కొనసాగుతుందని, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి ఐదు సమస్యలతోపాటు సూచనలు అందినట్లు డీఎం తెలిపారు.

ఆమిద్యాలలో వైద్యబృందం పర్యటన



మురుగు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో వైద్య బృందం పర్యటించి ఇంటింటా సర్వే నిర్వహించారు. శనివారం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి, రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్ పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరం, జలుబు, దగ్గు లాంటితో ఇబ్బందులు పడే వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇంటింటికీ వెళ్లి కరపత్రాల ద్వారా డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో మురుగు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురికి నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేశారు.

వారోత్సవాలు విజయవంతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కంబదూరు: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేద్దామని సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప కోరారు. శనివారం వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్యంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పవన్, రఘునాథ్‌రెడ్డి, కిరణ్, క్రాంతి, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మార్పు కోసమే విలువల బడులు

కుందుర్పి: సామాజిక మార్పు కోసమే విలువల బడులను నిర్వహిస్తున్నామని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఫిరోజ్‌ఖాన్, ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్ బాబు అన్నారు. మండలంలోని కరిగానపల్లిలోని పాఠశాలలో శనివారం మేలు కలయిక కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూవిలువల బడులతో సామాజిక మార్పు సాధ్యమన్నారు. కార్యక్రమంలో యస్‌కే చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

17 ఇసుక టిప్పర్ల సీజ్

రాయదుర్గం: మండలంలోని జుంజురంపల్లిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వద్ద 17 టిప్పర్లు, ఒక ఇటాచీని శనివారం సీజ్ చేసి సెబ్, సివిల్ పోలీసులకు అప్పగించామని మైన్స్‌అండ్‌జియాలజీ అధికారి రామకృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మరిన్ని వివరాలను వెల్లడించారు. రీచ్ గడువు ముగియడంతో రెన్యూవల్ ప్రాసెస్‌లో ఉందన్నారు. ఈలోపు కొందరు అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారనే విషయం ఉన్నతాధికారులకు తెలిసిందన్నారు. వారి ఆదేశాల మేరకు సెబ్, పోలీసులతో కలసి దాడులు నిర్వహించి వాహనాలను సీజ్ చేశామన్నారు. వాటిని రాయదుర్గం ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు భద్రపరిచారన్నారు. రెండు టిప్పర్లు ఇసుక లోడ్‌తో ఉండగా 15 టిప్పర్లు ఖాళీగా నిలిపి ఉంచారన్నారు. వీటిపై దర్యాప్తు చేస్తామని అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆర్టీసీ డిపో వద్దకు చేరుకుని సంబంధం లేని విప్ కాపు రామచంద్రారెడ్డికి అంటగట్టేలా మాట్లాడారు. కాలవ తీరును వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పుపట్టారు. పోలీసుల విచారణలో నిందితులు ఎవరో తేలేవరకు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం: మండలంలోని చాపిరి గ్రామానికి చెందిన గోవిందప్ప(64) శనివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు...ఉదయం గోవిందప్ప ఇంటి బయట ఉండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుడికి భార్య శాంతమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ

శెట్టూరు: మండల కేంద్రంలో శనివారం మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మార్సీ ప్రాంగణంలో నిర్వహించిన శిబిరంలో సుమారు 210 మందికి మార్క్ సూపర్ స్పెషలిటీ వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, నాయకులు బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, రామాంజినేయులు, వీరభద్రప్ప, టైగర్ వన్నూరుస్వామి, సుధాకర్, బాబు, బాబురావు, గౌరయ్య, అంజి, నారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కూడేరు: నంద్యాల జిల్లాలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు మండలంలోని మరుట్ల-2 హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం లాల్‌ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు రుక్మిణి శనివారం తెలిపారు. అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్ -17 విభాగంలో సాయిరాంరెడ్డి, సుచిత్ర, అండర్-14 విభాగంలో రమాకాంత్, జ్ఞానదీప్తి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

కళాశాలకు క్రీడా సామగ్రి వితరణ



ప్రిన్సిపాల్‌కు క్రీడాసామగ్రి, ప్రింటర్ అందజేస్తున్న దాతలు

రాయదుర్గం రూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అనంతపురానికి చెందిన జీ.టెక్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ అధినేతలు ఎస్.నవచేతన్, జీవీ జగదీశ్వర్‌రెడ్డి రూ.లక్ష విలువ చేసే క్రీడా సామగ్రితో పాటు ప్రింటర్ శనివారం వితరణ చేసినట్లు ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ఆయనతోపాటు అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీవారి పల్లకి సేవ



పెన్నహోబిలంలో పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. ప్రధాన అర్చకుడు ద్వారకనాథ చార్యులు ఆధ్వర్యంలో ఆకుపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి మూలవిరట్‌ను ప్రత్యేక పల్లకీలో ఉంచి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. పల్లకీ సేవలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.